హైన్రిక్ బోల్

# 10. యుద్ధం అయినాక

వేము జర్మనీ సరిహద్దు చేరేసరికి తూర్పు తెల్లవారుతున్నది. ఎడమపక్క విశాలమైన నది; కుడిపక్క అడవి, పక్కవాటంగా చూసినా దాని "లోతు" తెలుస్తున్నది. రైలుపెట్టెలో సద్దు మణిగింది. అతుకులు వేసిన పట్టాల మీదుగా, ఫిరంగిదెబ్బలు తిన్న ఇళ్ళ పక్కగానూ, ముక్కలు ముక్కలైన టెలిగ్రాఫు స్తంభాల పక్కగానూ, రైలు నింపాదిగా నడుస్తున్నది. నాపక్కనే చతికిలబడి ఉన్న యువక సైనికుడు, తన కళ్ళద్దాలు తీసి తుడుచుకుంటూ, "హేరి భగవంతుడా, మనం ఏ ప్రాంతాల ఉన్నామో నీకు కొంచెమైనా తెలుసా?" అని రహస్యంగా నన్నడిగాడు.

"తెలుసు. నువు ఇంతకుముందు చూసిన నదిని రైన్ అని పిలుస్తాం. కుడిపక్కగా ఆ కనిపించే అడవిపేరు రైష్వాల్డ్. మనం క్లోవిస్ చేరబోతున్నాం." అన్నాను.

"నువు ఈప్రాంతాలవాడివా?"

"కాను." అతను నన్ను మహా విసిగిస్తున్నాడు. తెల్లవార్లూ బడిపిల్లాడి కీచుగొంతుతో నన్ను చంపుకుతిన్నాడు. బ్రెఖ్ట్, తుచోల్‌స్కీ, వాల్టర్ బెంజమిన్, ఆఖరుకు ప్రూస్ట్, కార్ల్ క్రౌజ్‌ల రచనలను రహస్యంగా చదివానన్నాడు. తనకు సంఘశాస్త్రమూ, వేదాంతమూ చదవాలనీ, చదివి జర్మనీని మరమ్మతు చెయ్యడానికి కృషి చెయ్యాలనీ ఉన్నదన్నాడు. తరవాత, తెల్లవారుతూండగా రైలు ఆగి, జర్మనీ సరిహద్దు చేరుతున్నామని ఎవరో అనేసరికి, ఎవరైనా దారం ఇచ్చినట్టయితే

రెండు సిగరెట్టుపిక్కలిస్తానని ఆత్రంగా అందరినీ ఉద్దేశించి అడిగాడు. ఎవరూ పలక్కపోగా, నేను నా కాలరుకు కుట్టి వున్న చిహ్నాలను పీకేసి, వాటినుంచి ముదురు ఆకుపచ్చరంగు పోగుతీసి ఇవ్వడానికి సిద్ధపడ్డాను. నేను కోటువిప్పి ఇస్తే, అతను రేకుతో జాగ్రత్తగా వాటిని కోసి, పోగుతీసి, ఆ దారంతో తన భుజంమీది పట్టీలచుట్టూ "జడ" (పతాకధారి చిహ్నం) కుట్టనారంభించాడు. ఈ కుట్టడంలో బ్రెఖ్ట్, తుచోల్‌స్కీ, బెంజమిన్, కార్ల్ క్రౌజ్‌ల[1] ప్రభావం ఏమైనా వున్నదా, లేక దాచిఉంచిన యుంగర్[2] ప్రభావం ఫలితంగా అతను "వేలుగాడి'' ఆయుధంతో తన పూర్వపు హోదా పునరుద్ధరించుకుంటున్నాడా, అని అడిగాను. అతను కంది పోయి, తనకు యుంగర్‌తో ఏమీ సంబంధం లేదనీ, అతనితో తెగతెంపులు చేసేసుకున్నాననీ అన్నాడు. ఇప్పుడు రైలు క్లోవిస్ ప్రవేశించేసరికి అతను కుట్టడం ఆపి, తన వేలుగాడి ఆయుధంతోసహా నా పక్కన కూర్చుని, "క్లోవిస్‌కు సంబంధించినది నా కేదీ కొంచెంకూడా తట్టడం లేదు. నీకో?" అన్నాడు.

"తట్టుతున్నది. లోహెన్‌గ్రిన్, 'నీలంమార్కు హంస' మార్గరీన్, క్లోవిస్ అన్—ఎనిమిదవ హెన్రీ భార్యలలో ఒకతె,'' అన్నాను.

"నిజమే. లోహెన్‌గ్రిన్—అయితే మా ఇంట్లో స నెల్లా తినేవాళ్లం. సిగరెట్టుపిక్కలివ్వనా?'' అన్నాడతను.

"వద్దు. వాటిని తీసుకుపోయి మీ నాన్న కియ్యి. నీ భుజాలకు జడలు తగిలించుకుని వస్తే ఆయన గూబలు వాయగొడతా డనుకుంటాను,'' అన్నాను.

"నీ కేమీ అర్థం కావడం లేదు. ప్రష్యా, క్లైస్ట్, ఓడర్ ఫ్రాంక్‌ఫర్ట్, పోట్స్‌డామ్, హోంబర్గ్ రాజు, బెర్లిన్[3],'' అన్నాడు.

"సరే ఒకప్పుడు క్లోవిస్[4] ప్రష్యాలో చేరి ఉండేదనుకుంటాను. రైన్ అవతల పక్కన ఎక్కడో వెజెల్[5] చిన్న గ్రామం ఉన్నది,'' అన్నాను.

"అరే, నిజమే. షిల్[6] కూడానూ,'' అన్నా డతను.

"నిజానికి ప్రష్యను లేనాడూ రైన్‌దాటి రాలేదు. వాళ్లకు రెండు స్థావరాలు మటుకే వుండేవి : బాన్, కోబ్లెన్జ్[7]''

"ప్రష్యా,'' అన్నాడతను.

"బ్లోంబర్గ్[8],'' అన్నాను. ఇంకా దారం కావాలా అని అడిగితే అతను ఈవురించి, మాటాడక ఊరుకున్నాడు.

రైలు మెల్లిగా నడుస్తున్నది. అందరూ తెరిచిఉన్న రైలుపెట్టె వాకిలిదగ్గిర గుమికూడి క్లోవిస్‌ను చూస్తున్నారు. స్టేషనువద్ద ఇంగ్లీషు సెంట్రీలు; వాళ్ళు చూడడానికి బద్ధకంగానూ, దృఢంగానూ ఉన్నారు, ఏమీ పట్టనట్టుండి కూడా వెయ్యి కళ్ళతో చూస్తున్నారు; మే మింకా ఖైదీలమే; వీధిలో "కొలోన్‌కు" అని రాసిన సంకేతం ఉన్నది. లోహెన్‌గ్రిన్ కోట ఎత్తున, ఆకులురాలిన చెట్లమధ్యగా కనబడుతున్నది. అక్టోబరు మాసపు దిగువ రైన్ ప్రాంతం: డచ్చి ఆకాశం: జాంటెన్‌లో నా దాయాదులు, కెవలాయెర్‌లో నా పెద్దమ్మలు; యాసమాటలు, చాటువర్తకం చేసేవాళ్ళు, సారాదుకాణాల్లో చేసే రహస్య మంతనాలు; మార్టిన్‌మస్ ఉత్సవం ఊరేగింపులు, మనిషి ఆకారంగల రొట్టెలు, జాతర, అల్లంరొట్టెలు లేకుండానే అంతటా వాటి వాసన కొట్టేది.

"నన్ను కాస్త అర్థంచేసుకో," అన్నాడు నా పక్కనఉన్న యువకసైనికుడు.

"నన్ను చంపకు," అన్నాను. అతను ఏ విధంగా చూసినా ఇంకా సమగ్ర పురుషుడు కాడు, కాని త్వరలోనే అవుతాడు మరి. అందుకనే నా కతనంటే మంట. అతనికి కోపం వచ్చి, జడ కుట్టుకోవడం పూర్తి చెయ్యడానికి చతికిలబడి కూర్చున్నాడు. నాకు చప్పున అతనంటే జాలి కలిగింది. బొటనవేలంతా నెత్తురు మయం చేసుకుని, చేతావాతాకాకుండా, అతను తన నీలం జాకెట్టులోకి సూది గుచ్చుతున్నాడు. అతని కళ్లద్దాలు ఎలా ఆవిరి కమ్మి ఉన్నాయంటే, అతను నిజంగా ఏడుస్తున్నదీ, ఏడుస్తున్నట్టు కనబడుతున్నదీ తెలియరాలేదు. నేను కూడా కళ్ళనీళ్ళపర్యంతంగానే ఉన్నాను. ఇంకో రెండు గంటల్లో, మహాఅయితే మూడు గంటల్లో, మేము కొలోన్‌లో ఉంటాం. అక్కడికెంతో దూరంలో లేదు నేను పెళ్లాడిన మనిషి—ఆమెలో పెళ్లిగొంతు నేను విననేలేదు.

ఆ ఆడమనిషి అకస్మాత్తుగా గుడ్స్‌షెడ్ వెనకనుంచి వచ్చి, సెంట్రీలు తెలుసుకునే లోపుగా మా పెట్టెముందుకు వచ్చి నిలిచి, నీలంగుడ్డ మూటనుంచి — దాన్నిచూసి మొదట నేను బిడ్డ అనుకున్నాను — రొట్టె ఒకటి తీసి నా చేతుల్లో పెట్టేసింది; నేను దాన్ని తీసుకున్నాను; అది బరువుగా ఉన్నది. క్షణంపాటు నేను ముందుకు తూలి, వేగం హెచ్చుతున్న రైలునుంచి పడిపోయినంత పని చేశాను. రొట్టె నల్లగానూ, ఇంకా వెచ్చగానూ ఉన్నది. నేను "థాంక్ యూ, థాంక్ యూ," అని కేకపెడదామనుకున్నాను. కాని ఆమాట బొత్తిగా అర్థంలేనిదిగా

తోచింది, రైలువేగం హెచ్చింది కూడానూ. అందుచేత ఆ బరువైన రొట్టెను నా చేతుల్లో పట్టుకుని, మోకాళ్లమీద కూర్చుని ఉండిపోయాను. ఆ ఆడమనిషి నల్లని స్కార్ఫ్ ధరించిందనీ, ఆమెకు యౌవనం దాటిపోయిందనీ తప్పిస్తే ఈ నాటికి కూడా ఆమెను గురించి మరేమీ తెలియదు.

నేనా రొట్టెను చేతుల్లో పెట్టుకుని లేచి నిలబడినప్పుడు రైలుపెట్టె ముందు కన్నా కూడా ఇంకా నిశ్శబ్దంగా ఉంది. అందరి కళ్లూ ఆ రొట్టెమీదనే ఉన్నాయి. వాళ్లు చూస్తున్నకొద్దీ దాని బరువు హెచ్చిపోతున్నది. నాకా కళ్లు తెలుసు, వాటి వెంట ఉన్న నోళ్లూ తెలుసు. తిరస్కారానికీ, ద్వేషానికీ మధ్యఉండే సరిహద్దు ఎలా ఉంటుందోనని నెలల తరబడి ఆలోచించికూడా తెలుసుకోలేకపోయాను. అమెరికను కాంపు (అక్కడ హోదాచిహ్నాలైన బాడ్జీలు ధరించరాదు) నుంచి ఇంగ్లీషు కాంపుకు (అక్కడ ధరించవచ్చు) మమ్మల్ని మార్చినప్పుడు నేను వీళ్లందరినీ రెండు తరగతులుగా, కుట్టేవాళ్లూ కుట్టనివాళ్లూ కింద, విభజించాను. కుట్టనివాళ్లంటేనే నాకు కాస్త అభిమానంగా వుండేది, కాని అంతలోనే నాకు తెలియవచ్చింది, వాళ్లకు బాడ్జీలు ధరించదగిన హోదాలు లేవని. వారిలో ఒకడైన ఎగెల్‌హెఫ్ట్ ఒకవిధమైన దర్బారు ఏర్పాటుచేసి దానిద్వారా నాకు జర్మను అనిపించుకునే ఆస్కారంకూడా లేకుండా చేద్దామని ప్రయత్నించాడు. (ఈ దర్బారు ఏర్పాటు కానేలేదు, కాని అలా జరిగి నేను జర్మనును కాననిపించుకుంటే బాగుండునని కోరుకున్నాను.)

ఆ నాజీలకూ, నాజీలు కానివాళ్లకూ నేను తమను ఎంతగా ద్వేషించానో తెలియదు; వాళ్లు బాడ్జీలు కుట్టుకున్నారని కాదు, వాళ్ల రాజకీయ దృక్పథాలను బట్టి కూడా కాదు: వాళ్ళలాటి మనుషులమధ్య నేను ఆరేళ్ళపాటు వున్నాను, అందుకని; నా దృష్టిలో మనిషికీ మూర్ఖుడికీ తేడా అన్నది లేకుండా పోయింది.

"మొట్టమొదటి జర్మనురొట్టె పడకపడక అతగాడి చేతిలోనే పడాలా?" అని ఎగెల్‌హెఫ్ట్ అన్నమాటలు నా వెనకనుంచి వినిపించాయి.

అతని గొంతులో దుఃఖం. నేనూ ఏడవడానికి సిద్ధంగానే ఉన్నాను, రొట్టె కారణంగానేకాదు, జర్మనీ సరిహద్దు దాటినందుకనీకాదు: ముఖ్యంగా, ఎనిమిది మాసాల అనంతరం నా చేతికి ఒక ఆడదాని చెయ్యి తగిలినందుకు—అలా అని వాళ్ళు అర్థం చేసుకోలేరు,

"నువు బహుశా ఆ రొట్టెకు కూడా జర్మనులక్షణాలు లేకుండా చేస్తావేమో," అన్నాడు ఎగెల్‌హోఫ్ట్ చిన్నగా.

"అవును. మేధోప్రజ్ఞ ఉపయోగించి నన్ను నేనిలా ప్రశ్నించుకుంటాను : ఈ రొట్టె తయారుచెయ్యడానికి ఉపయోగించిన పిండి డచ్చిదో, ఇంగ్లీషుదో, అమెరికనుదో కాదుగద ?....ఇలా రా, కావలిస్తే దీన్ని పంచు," అన్నాను.

వాళ్ళలో చాలామంది అంటే నాకు అసహ్యం. చాలామందికి నేనంటే అలక్ష్యం, కుక్కేవారిలో చివరకు చేరిపోయిన వేలుగాడు కూడా నాకు చిరాకు తెప్పిస్తున్నాడు; అయినాకూడా ఈ రొట్టెను అందరితోనూ పంచుకోవడం నాకు భావ్యమనే తోచింది. అది నా ఒక్కడి కోసమే ఇచ్చినది కాదని చెప్పగలను. ఎగెల్‌హోఫ్ట్ నెమ్మదిగా ముందుకు వచ్చాడు. అతను ఎత్తుగానూ, సన్నగానూ ఉన్నాడు, నా అంత ఎత్తుగానూ, సన్నగానూ ఉన్నాడు. అతని వయస్సు ఇరవై ఆరేళ్ళు, నా వయసే. జాతీయవాది (నేషనలిస్టు) అంటే నాజీ కాదనీ; ప్రతిష్ఠా, దేశభక్తీ, మాతృదేశమూ, మానమర్యాదలూ అనే వాటి విలువ మాయదనీ స్పష్టం చెయ్యడానికి మూడు మాసాలుగా ప్రయత్నిస్తున్నాడతను—అతని వాగాడంబరానికి అయిదే అయిదు మాటలు అడ్డువేశాను : రెండో విలియం, పాపెన్, హిండెన్‌బర్గ్, బ్లోంబర్గ్, క్రైటెల్[9]. అతనికి కోపం, నేను ఎన్నడూ హిట్లరు పేరెత్తనని. "హిట్లరు మరణించాడు, చనిపోయా డాయన," అని మెగాఫోనులో అరుస్తూ మే మొదటి తేదీన సెంట్రీ కాంపుగుండా పరిగెత్తినప్పుడు కూడా నేను ఆ పేరు ఎత్తనే లేదు.

"కానీ, రొట్టె పంచు," అన్నాను.

"వరసగా సంఖ్య చెప్పుకురండి," అన్నాడు ఎగెల్‌హోఫ్ట్. నేను రొట్టె అతని కిచ్చాను. అతను తన కోటువిప్పి, నేలపైన వెల్లికిలా పరిచి, కోటు లోపలి పక్క ఉండే లైనింగు ముడతలు సరిచేసి, రొట్టెను దానిమీద పెట్టాడు. ఈలోపల మా చుట్టూ వున్నవాళ్లు సంఖ్యలు పలికారు. వేలుగాడు, "ముప్పై రెండు" అన్న తరవాత నిశ్శబ్దం. ఎగెల్‌హోఫ్ట్, "ముప్పై రెండు," అని నాకేసి చూశాడు. నేను, "ముప్పై మూడు" అనాలి. కాని నేనా సంఖ్య చెప్పక, తల పక్కకు తిప్పి బయటికి చూశాను. రోడ్డూ, చెట్లూనూ; నెపోలియన్ పాప్లర్‌లు, నెపోలియన్ ఎల్మ్‌లు; సిగిరెట్లూ, చాకలెట్లూ చౌకగా దొరుకుతాయని వీజెనుంచి డచ్చి

సరిహద్దుకు సైకిళ్ళమీద నేనూ మా తమ్ముడూ వెళ్ళినప్పుడు ఈ చెట్లకిందనే విశ్రాంతి తీసుకునేవాళ్ళం.

నా వెనకఉన్న వాళ్ళకు చాలా ఆగ్రహం వచ్చిందని గ్రహించాను; రోడ్డు మీద, కాల్కార్‌కు, కాన్జెన్‌కు, గెల్‌దెర్న్‌కు అని పసుపుపచ్చని సూచికలు చూస్తున్నాను, వెనక ఎగెల్‌హెఫ్ట్ ఉక్కుకత్తి చేసే చప్పుళ్ళు వింటున్నాను: వాళ్ళ కోపం అంతకంతకూ పెరిగి సాంద్రమైన మేఘంలాగా అవుతున్నది. ఎందుకోగాని వాళ్ళు ఎప్పుడూ అలుగుతారు. ఒక ఇంగ్లీషు సెంట్రీవాడు సిగరెట్టు ఇవ్వబోయాడు, అలిగారు; వాడా సిగరెట్టివ్వ నిరాకరించినా అలిగారు; నేను హిట్లరు గురించి సణిగితే అలిగారు, హిట్లరుగురించి సణగనందుకు ఎగెల్‌హెఫ్ట్‌కు చచ్చేకోపం వచ్చింది. బెంజమిన్, బ్రెఖ్ట్, ప్రూస్ట్, తుచోల్‌స్కీ, కార్ల్ క్రౌజ్‌ల రచనలు రహస్యంగా చదివిన వేలుగాడు జర్మనీ సరిహద్దు దాటగానే ఎన్‌సైన్ జడలు కుట్టుకున్నాడు. నా కార్పొరల్ స్ట్రైపులిచ్చి సంపాదించుకున్న సిగిరెట్టు జేబులో నుంచి తీసి, వెనక్కు తిరిగి, వేలుగాడి పక్కనే కూర్చున్నాను. ఎగెల్‌హెఫ్ట్ రొట్టె కొయ్యడం గమనించాను. ముందు రెండు చేశాడు, తరవాత నాలుగు చేశాడు, ఒక్కొక్క పావునూ ఎనిమిదేసి భాగాలు చేశాడు. ఒక్కొక్కరికీ అరవై గ్రాముల బరువుగల నల్లరొట్టెముక్క వస్తుందని అంచనా వేశాను. ఎగెల్‌హెఫ్ట్ ఆఖరు పరకముక్కను నాలుగుఖండాలు చేయసాగాడు. మధ్యముక్కలు వచ్చిన వాళ్ళకు కనీసం అయిదు, పదిగ్రాములు అధికంగా వస్తుందని అందరికీ తెలుసు. ఎందుకంటే రొట్టె మధ్యభాగంలో ఉబ్బెత్తుగా ఉన్నది. ఎగెల్‌హెఫ్ట్ అన్నిముక్కలనూ ఒకేమందానికి కోశాడు. అయితే అతను మధ్యముక్కలు రెంటిమీది ఉబ్బును కోసి, "ముప్పైమూడు—అందరికన్నా చిన్నవాడు ముందు తీసుకోండి," అన్నాడు. వేలుగాడు నాకేసి చూసి, జేవురించి, వంగి ఒకముక్కను అందుకుని, వెంటనే నోట పెట్టేసుకున్నాడు. అంతా సవ్యంగానే జరిగింది. అస్తమానమూ విమానాలను గురించి మాట్లాడి నాకు మతిపోగొట్టిన బూవియర్ తన ముక్క తీసుకున్నాక నా వంతు వచ్చింది. నా తరవాత ఎగెల్‌హెఫ్ట్ వంతు. కాని నేను కదల లేదు. నాకు సిగిరెట్టు వెలిగించాలని ఉన్నదిగాని, నా దగ్గిర అగ్గిపుల్లలు లేవు, ఎవరూ నా కివ్వలేదు. అప్పటికే రొట్టెముక్కలు తీసుకున్నవాళ్ళు కంగారుగా తినడం మానారు, ఇంకా తీసుకోనివాళ్ళకు ఏంజరుగుతున్నదీ తెలియలేదుగాని,

అర్థంచేసుకున్నారు: వాళ్ళతోబాటు ఆ రొట్టె పంచుకోవడం నాకిష్టంలేదు. వాళ్ళకు కోపం వచ్చింది; రొట్టెముక్కలు తీసేసుకున్నవాళ్ళకి ఏంచెయ్యాలో తెలియలేదు. నేను బయటికి చూడ యత్నించాను—నెపోలియన్ పాప్లర్లకేసీ, నెపోలియన్ ఎల్మ్లకేసీ, చెట్లబాటలో గల ఖాళీలకేసీ, వాటికుండా కనిపించే డచ్చి ఆకాశం కేసీ. అయితే నిర్లక్ష్యంగా కనబడడానికి నేను చేసిన యత్నం ఫలించలేదు; కొట్లాట సాగుతుందని నాకు తెలుసు, భయంవేసింది; నేను కొట్లాటలకు తగినవాణ్ణి కాను, ఒకవేళ తగుదునే అనుకున్నా, అందువల్ల ప్రయోజనంలేదు, నన్ను పచ్చడి చేసేస్తారు—బతికున్న జర్మనువాడికన్న చచ్చిన యూదువాడు మేలన్నందుకు బ్రుసెల్స్ కాంపులో నేను తన్నులు తిన్నట్టుగానే. నా నోటినుంచి సిగరెట్టు తీశాను; అది హాస్యాస్పదంగా తోచడం ఒక కారణమూ, కొట్లాటకు సిద్ధంగా ఉండడం ఇంకో కారణమూనూ. ఎర్రగా జేవురించిన ముఖం వేసుకుని నాపక్కన కూర్చునిఉన్న వేలుగాడికేసి చూశాను. నా తరవాత రొట్టెముక్క తీసుకోవలిసిన గుగెలర్ తనవంతు ముక్క తీసుకుంటూనే నోట్లో పెట్టేసుకున్నాడు. మిగిలిన వాళ్ళుకూడా తమతమ వంతు ముక్కలు తీసేసుకున్నారు. ఇంకా మూడుముక్కలు దిగబడ్డాయి. ఆసమయంలో, నా కింకా పరిచయంకానివాడు ముందుకొచ్చాడు. మేము బ్రుసెల్స్ కాంపులో ఉండగానే అతను మా గుడారంలో ప్రవేశించాడు. అతను వయసు మళ్ళిపోయినవాడు, అధమం యాభై ఏళ్ళు, అల్పమైన మనిషి, ముఖాన వాతలు. మేము వాదనకు దిగినప్పుడల్లా, తను నోరుమెదపక, గుడారం బయటికి వెళ్ళి, ముళ్ళతీగెకంచె వెంబడి, బాగా అలవాటున్నవాడిలాగా పరిగెత్తే వాడు. అతని మొదటి (సొంత) పేరుకూడా నాకు తెలీదు, బాగా మాసిపోయిన ట్రాపికల్ యూనిఫామూ, సివిలియనులు ధరించే హాఫ్షూలూ ధరించి ఉన్నాడు. రైలుపెట్టె వెనకభాగంనుంచి తిన్నగా నా దగ్గిరికి వచ్చి, నాముందు నిలబడి, ఊహించరానంత మృదువుగా. "రొట్టె తీసుకో," అన్నాడు. నేను తీసుకోకపోయే సరికి తల అడ్డంగా తిప్పి, "ప్రతి చిన్నదాన్నీ లాంఛనచర్యగా చేసే విద్యలో ఘటికుడివే. అది రొట్టె, అంతకన్న మరేమీ కాదు, ఆ అడమనిషి దాన్ని నీ కిచ్చింది. ఇంద," అంటూ అతనొక ముక్క తీసి, జార్చిఉన్న నా కుడిచేతిలో నొక్కిపెట్టి, నా చెయ్యి గట్టిగా మూశాడు. అతని కళ్ళు నల్లగా లేకపోయినా ముదురురంగుగా ఉన్నాయి. అతని ముఖం చాలా ఖైదులు చూసినట్టున్నది. నేను

తల ఆడించి, రొట్టెముక్కను గట్టిగా పట్టుకున్నాను. రైలుపెట్టె అంతా ఒక్క దీర్ఘనిశ్వాసం విడిచింది. ఎగెల్‌హెఫ్ట్ తనముక్క తీసుకున్నాడు, తరవాత ట్రాపికల్ యూనిఫాం ధరించిన ముసలివాడుకూడా తీసుకున్నాడు. "డామిట్, నేను జర్మనీ విడిచిపెట్టి పన్నెండేళ్లయింది. కాని క్రమంగా నాకు మీ పిచ్చి అర్థం అవుతున్నది," అన్నాడా ముసలివాడు. నేను రొట్టెముక్క నోటపెట్టుకునే లోపునే రైలు ఆగింది, మేము దిగాం.

మైదాన ప్రదేశం, టర్నిప్ దుంపల పొలాలు, చెట్టన్నది లేదు. కుళాయిల మీదా, కాలర్లమీదా ఫ్లాండర్స్‌సింహం చిహ్నాలు ధరించిన బెల్జియం సైనికులు కొద్దిమంది రైలుతోబాటు పరిగెత్తుతూ, "దిగండి—అందరూ దిగండి" అని కేకలు పెట్టారు.

వేలుగాడు నా వెంటే ఉన్నాడు; కళ్ళద్దాలు తుడుచుకుని, స్టేషను బోర్డుకేసి చూసి, "వీజె—దీన్ని గురించి కూడా నీకేమైనా తట్టుతున్నదా ?" అని అడిగాడు.

"ఆ. ఇది కెవలాయెర్‌కు ఉత్తరంగానూ, జాంటెన్‌కు పడమరగానూ ఉంటుంది," అన్నాను.

"అఁ, కెవలాయెర్—హైన్‌రిఖ్ హైన్[10]," అన్నాడతను.

"మరిచావేమో, జాంటెన్[11]—సీగ్‌ఫ్రీడ్",

ఆంట్ హెలెన్, వీజె, అని నాలో అనుకున్నాను. కొలోన్‌కుండా ఎందుకు వెళ్లాముకాము ? చెట్ల తలల మధ్యని పెంకురంగు మరకలు తప్ప వీజెలో చూడ డాని కేమంత లేదు. వీజెలో ఆంట్ హెలెన్‌కు పెద్ద షాపు ఉండేది, నిజమైన గ్రామ దుకాణం. ప్రతి ఉదయమూ మాకు డబ్బు లిచ్చేది, అదిపెట్టి మేము నైర్స్ నదిపైనగాని, సైకిళ్ళమీద కెవలాయెర్‌కుగాని వెళ్లేవాళ్ళం; ఆదివారాలు చర్చిలో సెర్మన్‌లు: అవి దొంగరవాణాలు చేసేవారిమీదా, రంకుతనాలు చేసేవాళ్ళమీదా సాగేవి.

"పదండి. మీకు ఇళ్ళకుపోవాలని లేదా ?" అంటూ బెల్జియన్ సెంట్రీ దారి తీశాడు.

కాంపు ప్రవేశించాను. మొట్టమొదట మేము ఒక ఇంగ్లీషు ఆఫీసరును దాటి వెళ్లాలి. అతను మాకొక ఇరవై మార్కుల నోటిచ్చి, ముట్టినట్టు రశీదు తీసుకున్నాడు. తరవాత డాక్టరు దగ్గిరికి వెళ్లాం. అతను జర్మను, యువకుడు,

ఇకిలించాడు. గదిలోకి పది పదిహేనుమంది చేరేదాకా ఆగి, అతను, "ఇవాళ, ఇవాళంటే ఇవాళే, కుట్రచెయ్యడానికి మరీజబ్బుగా ఉన్నవాళ్ళెవరో చేతులెత్తండి" అన్నాడు. ఈ విడ్డూరమైన జోక్‌కు కొద్దిమందిమి నవ్వాం; తరవాత ఒక్కొక్కళ్ళమే అతని బల్లవద్దకు వెళ్ళి, మా డిశ్చార్జి కాగితాలపైన ముద్రవేయించుకుని, అవతలి ద్వారంకుండా బయటికి వెళ్ళాం. నేను ద్వారంవద్ద కొద్ది క్షణాలు నిలిచి, "ఇవాళ, ఇవాళంటే ఇవాళే—" అని అతను అనడం విని, ముందుకు సాగాను. నడవ అవతలి చివరకు చేరేసరికి నవ్వులు వినిపించాయి. తరవాత మరొక పోస్ట్‌కు వెళ్ళాను. ఇక్కడ ఒక ఇంగ్లీషు సార్జంటు తెరిచివున్న మరుగుదొడ్డి ప్రక్కన నిలబడి, "మీదగ్గిర ఇంకా మిగిలిఉన్న పేబుక్కులూ, కాగితాలూ పైకితియ్యండి," అని జర్మనుభాషలో అని, అలా తీసినవాటిని మరుగుదొడ్డిలో పారెయ్యమన్నాడు. అందరూ ఆ పని చేస్తుంటే, అతను తిరిగి జర్మను భాషలోనే, "సుఖాన్వేషణ చెయ్యండి," అన్నాడు. చాలామంది ఈ జోకుకు నవ్వారు. జర్మనులకు ఉన్నట్టుండి హాస్యం, అందులోనూ విదేశీ హాస్యం, రుచించ నారంభించిందని నేను స్థూలంగా గ్రహించాను. కాంపులో అమెరికన్ కాప్టన్ ముళ్ళతీగె కంచెను చూపుతూ, "అబ్బాయిలూ, అటే దిగులుపడకండి. మీ కిక స్వేచ్ఛ కలగబోతున్నది," అన్నప్పుడు ఎగెల్‌హోఫ్ కూడా నవ్వాడు.

ఇంగ్లీషు సార్జంటు నన్నుకూడా కాగితా లడిగాడు, కాని నా దగ్గిర డిశ్చార్జి కాగితాలు తప్ప ఏమీ లేవు. నా పేబుక్కును ఒక అమెరికనుకు రెండు సిగరెట్ల కమ్మాను. అందుకని, "కాగితాలు లేవు," అన్నాను. అతనికి కోపం వచ్చింది. లోగడ అమెరికను సార్జంటు నన్ను, "హిట్లరు యూత్‌వా, ఎస్‌ఏవా, పార్టీవాడివా?" అని అడిగితే, "కాదు," అని చెప్పినప్పు డతనికీ ఇలాగే కోపం వచ్చింది; నా మీద అరిచి, నాకు అదనపు డ్యూటీ ఇచ్చి, నన్ను శాపనార్థాలు పెట్టి, మా అమ్మమ్మకు ఏవేవో రంకులు అంటగట్టాడు; అమెరికనుతిట్లు అర్థంగాకపోవడం చేత అదేమిటో నాకు వైనంగా తెలియలేదు. తాము అనుకున్నదానికి ఏదన్నా అతకకపోతే వాళ్లకు చెడ్డ కోపం. ఇంగ్లీషు సార్జంటు కోపంతో మండిపోతూ నన్ను వెతికి, త్వరలోనే నా డయరీ పట్టుకున్నాడు. కాగితపు సంచులు సైజుకు కత్తిరించి, కాగితపు టాకాలతో బంధించిన ఆ డయరీ లావుపాటిది; ఏప్రిలు మధ్యనుంచి సెప్టెంబరు మధ్య దాకా, అమెరికన్ సార్జంటు స్టీవెన్సన్‌కు నేను

చిక్కినది మొదలు అప్పటిదాకా, నాకు కలిగిన అనుభవాలను అందులో రాసుకున్నాను. నేనందులో ఆఖరుకు రాసుకున్నది రైలులో ఉండగా. అప్పుడు మేము ఆంట్వెర్ప్‌పైకుండా పోతున్నాం. ఆంట్వెర్ప్ నిర్జీవంగా ఉన్నది. అక్కడ ఒక గోడమీద, "రాజు వర్ధిల్లాలి!" అని చదివాను. సంచీల కాగితం నూరు పేజీలకు పైగా ఉన్నది. వాటినిండా ఒత్తుగా రాసుకున్నాను. సార్జంటు ఆగ్రహావేశంలో దాన్ని తీసుకుని మరుగుదొడ్డిలోకి విసరివేస్తూ, "కాగితాలుంటే ఇచ్చెయ్యమనలేదూ ?" అని, నన్ను పోనిచ్చాడు.

కాంపు గేటు దగ్గిర బెల్జియన్ లారీలకోసం ఎదురుచూస్తూ ఒరుసుకుని నిలుచున్నాం. అవి మమ్మల్ని బాన్ చేర్చుతాయన్నారు. మరోచోటూ మరోచోటూ కాకుండా బాన్ దేనికో ? కొలోన్ నిండా శవాలుండడంచేత అది నిషేధమని ఎవరో అన్నారు. మరొకరెవరో అన్నారు, మేము మున్నై, నలభై ఏళ్ళపాటు పారలు తీసుకుని చెత్తా, తుక్కూ తీయాలట, శిథిలమైన ఇళ్ళతుక్కు. "ఆఖరుకు ట్రక్కులైనా ఇవ్వరు. తుక్కంతా తట్టలతో మోసుకుపోవాలి." అదృష్టవశాన నా సమీపంలో, నాతోబాటు డేరాలో పడుకున్నవాళ్ళుగాని, రైలుపెట్టెలో ప్రయాణించిన వాళ్ళుగాని ఎవరూ లేరు. నాకు తెలిసినవాళ్ళ వాగుడుకంటె తెలియనివాళ్ళ వాగుడు ఒక్కపిసరు నయం. నాకు ముందు నిలబడిఉన్నవాళ్ళలో ఎవడో ఒకడు, "అయితేనేం ? యూదువాడి రొట్టె తీసేసుకున్నాడు," అన్నాడు. "అవును, అలాంటివాళ్ళే శాసకులు కాబోతారు," అన్నాడు మరొకడు. ఎవరో నన్ను వెనకనుంచి మోచేత్తో తోసి, "ఒక సిగరెట్టుకు నూరు గ్రాముల రొట్టె, ఏమంటావు ?" అంటూ వెనకనుంచి నా ముఖం ముందొక రొట్టెముక్క చాచాడు. రైలుపెట్టెలో ఎగెల్‌హెర్ట్ పంచిన ముక్కలలో అదొకటని తెలుసుకుని తల అడ్డంగా తిప్పాను. "బెల్జియనులు పది మార్కులకొక సిగరెట్టు అమ్ముతున్నారు," అన్నాడు మరొకడు. చాలా చౌక అనిపించింది నాకు. కాంపులో జర్మనులు నూటఇరవైమార్కులకొక సిగరెట్టు అమ్మారు. "ఎవరికైనా సిగరెట్లు కావాలా ?" "కావాలి," అని, ఎవరిదో చేతిలో ఇరవైమార్కులనోటు పెట్టాను. అందరూ అందరితోటీ వ్యాపారం చేస్తున్నారు. అందులో మాత్రమే వారికి శ్రద్ధ ఉన్నట్టు కనబడింది. రెండువేలమార్కులూ, ఒక చినుగుల యూనిఫామూ ఇచ్చి ఎవరో సివిలియన్ దుస్తులు కొన్నారు. ఆ గుంపులో వసువుల మార్పిడీ, వేషాల

మార్పూ సాగిపోతున్నాయి. "దానితో డ్రాయరు కూడా ఇచ్చి తీరాలిసిందే. పై కూడా," అని ఎవరో గట్టిగా అరిచారు. ఒకరు చేతి గడియారాన్ని మూడువేల మార్కులకు అమ్మారు. హెచ్చుగా అమ్ముడవుతున్నది సబ్బు. అమెరికను కాంపులనుంచి వచ్చినవాళ్ళ దగ్గిర బోలెడు సబ్బున్నది, చాలామంది దగ్గిర ఇరవై సబ్బుబిళ్ళలదాకా ఉన్నాయి, ఎందుకంటే వారం వారం సబ్బిచ్చేవాళ్ళు, కాని స్నానానికి నీరుండేది కాదు. ఇంగ్లీషు కాంపులలోవాళ్ళ కసలు సబ్బే లేదు. ఆకుపచ్చని సబ్బుబిళ్ళలూ, ఎర్రనిబిళ్ళలూ తెగ చేతులు మారాయి. చాలామంది తమ సృజనాసక్తిని సబ్బుమీద ప్రయోగించి బుల్లి కుక్కలనూ, పిల్లులనూ, దిష్టిబొమ్మలనూ తయారుచేసి, సబ్బుకుగల మార్కెటు ధర కొంత చెడగొట్టారు, ఎందుకంటే బొమ్మలరూపం ధరించిన సబ్బు బరువు తరిగిపోతుంది. నేను ఇరవై మార్కుల నోటు పెట్టిన చెయ్యి తిరిగి ప్రత్యక్షమై, నా ఎడమచేతిలో రెండు సిగరెట్లు పెట్టింది. అంత న్యాయబుద్ధి చూసి నాకు అబ్బురమయింది. కాని, బెల్జియనులు అయిదు మార్కుల కొక సిగరెట్టు చొప్పున అమ్ముతున్నట్టు నాకు తెలియవచ్చింది; అంతకంత లాభం చేసుకోవడం, అందులోనూ "కామ్రేడ్స్" మధ్య, సవ్యమే నన్న మాట. ఉక్కిరిబిక్కిరవుతూ అక్కడ రెండు గంటలబాటు నిలబడ్డాం; నాకు చేతులు మాత్రమే గుర్తున్నాయి—సబ్బును కుడినుంచి ఎడమకూ, ఎడమనుంచి కుడికీ అందిస్తూ వర్తకం చేసే చేతులు; నాకు పాములతుట్టె మధ్య ఉన్నట్టనిపించింది; అన్నివైపులనుంచీ అన్నివైపులకూ ఆడుతూ, నా భుజాల మీదుగానూ, నెత్తిమీదిగానూ, వస్తువులనూ, డబ్బునూ చేరవేసిన చేతులు.

వేలుగాడు మళ్లా ఎలాగో నా పక్కకు చేరాడు. బెల్జియన్ లారీలో నా పక్కనే వచ్చి చతికిలబడ్డాడు. అది కెవలామెర్‌కేసీ, కేమామెర్‌కుండా క్రెషెల్ట్‌కేసీ, క్రెషెల్ట్‌చుట్టి నాయిస్‌కూ పోతున్నది. పొలాలూ, ఊళ్లూ నిస్తబ్ధంగా ఉన్నాయి, మాకు బహుకొద్దిమంది మనుషులు కనిపించారు, కొద్ది జంతువులు కనిపించాయి. హేమంతపు ఆకాశం అచ్ఛాదితంగాఉన్నది. నా ఎడమపక్క వేలుగాడూ, కుడిపక్క బెల్జియన్ సెంట్రీ కూర్చున్నారు. మేము రోడ్డుకేసి చూశాం. నాకా రోడ్డు బాగా తెలుసు. నేనూ, నా తమ్ముడూ ఆ రోడ్డువెంబడి సైకిళ్ళమీద వెళ్ళేవాళ్ళం. వేలుగాడు పదేపదే ఆత్మసమర్థనకు యత్నించాడు, కాని ప్రతిసారీ నే నతని నోరు మూశాను; తన తెలివి చూపాలని చూశాడు, నిగ్రహించుకోలేకపోయాడు.

"నాయిస్ మాటేమిటి ? దాన్నిగురించి నీ కేమీ తట్టదు. నాయిస్ గురించి తట్ట డాని కేముందని ?" అన్నాడతను.

"నోవెజియా చాకలేట్, జోవర్‌క్రౌట్, క్విరినస్, తీబన్‌లీజియన్[12] గురించి నీకు తెలియదనుకుంటాను," అన్నాను.

అతను తిరిగి జేవురించి, "తెలియదు," అన్నాడు.

కొలోన్‌నిండా శవాలున్నమాటా, అక్కడికి ఎవ్వరినీ రానివ్వనిమాటా నిజమేనా అని బెల్జియన్ సెంట్రీని అడిగాను. "లేదు, కాని అక్కడి పరిస్థితి బాగా లేదు. మీదా పూరా ?" అని అతనడిగాడు.

"అవును," అన్నాను.

"అయితే దేనికైనా సంసిద్ధుడవై ఉండు. నీ దగ్గిర సబ్బున్నదా ?"

"ఉన్నది," అన్నాను.

"ఇదుగో," అంటూ అతను తన జేబులోనుంచి పొగాకు పాకెట్టు తీసి, తెరిచి, మంచి పసుపువన్నెగల తాజాపొగాకు, సన్నగా కత్తిరించినది నా ముక్కుదగ్గిర పెట్టి, "రెండు సబ్బుబిళ్ళ లిస్తే దీన్ని నీ కిస్తాను—బేరం నీకు నచ్చితే," అన్నాడు. నేను తల ఆడించి, జేబులో తడివి, రెండు సబ్బుబిళ్ళలు తీసి అతనికిచ్చి, పొగాకు పాకెట్టు జేబులో వేసుకున్నాను. అతను సబ్బుబిళ్ళలను జేబులో పెట్టుకోవడానికి తన మరపిస్తోలు నన్ను పట్టుకోమని, నేను దాన్ని తనకు తిరిగి ఇచ్చేటప్పుడు నిట్టూర్చాడు. "ఈ దిక్కుమాలిన ఆయుధాలు, ఇంకా కొంతకాలం వీటిని పట్టుకోవాలనుకుంటాను. మీ పని మీరనుకునేటంత అన్యాయం కాదు. లేక మీరు అప్పుడే ఏడ్చారా ?" అన్నాడతను.

నేను కుడిపక్కనున్న రైన్‌నదికేసి చూశాను. మేము డోర్మాగెన్‌కు పోతున్నాం. వేలుగాడు నోరు తెరవడానికి సిద్ధమవుతూండడం చూసి, "నోరు మూసుకో, నీకు పుణ్యం ఉంటుంది. మరి మాట్లాడకు," అన్నాను చప్పున. రైన్ చూస్తే నీకేమైనా జ్ఞాపకం వస్తున్నదా అని అడుగుదామనుకున్నా డనుకుంటాను. అదృష్టవశాన అతనికి బాగా రోషం వచ్చి బాన్ చేరినదాకా ఏమీ అనలేదు.

కొలోన్‌లో ఇంకా చాలా ఇళ్ళు కూలిపోకుండా నిలిచిఉన్నాయి; ఒకచోట ట్రాము నడుస్తున్నది; మనుషులు కనిపించారు, స్త్రీలుకూడా; ఒకతె మాకేసి చెయ్యి ఊపింది. మేము నాయిస్ వీధిలోనుంచి రింగ్స్[13]లోకి తిరిగి, రింగ్స్ వెంబడి

ప్రయాణించాం. అంతసేపూ కన్నీరు కారడం కోసం ఎదురుచూశాను, అది రానే లేదు. రింగ్స్‌లో ఉండే ఇన్సూరెన్సు భవనంకూడా నాశనమయింది. హోహెన్ స్టాఫెన్ ఫూల్ తాలూకు నీలంరంగు ఇటుకలు కొద్దిగా కనిపించాయి. లారీ ఎక్కడోక్కడ కుడిపక్కకు తిరుగుతుందేమో నని అంతసేపూ చూశాను, ఎందు కంటే మేము కారిలింజియన్ రింగులో ఉండేవాళ్ళం; కాని లారీ పక్కకు తిరగక, తిన్నగా రింగ్స్‌వెంబడే నడిచింది. బార్బరోసా స్క్వేర్, శాగ్జన్ రింగ్, శాలియన్ రింగ్. నేను చూడకుండా ఉండడానికి యత్నించాను, ఖ్లోడ్విగ్ స్క్వేర్ దగ్గిర లారీల వలన కదలలేని స్థితి ఏర్పడకపోయినట్టయితే చూడకపోయే ఉందును. మేముండిన ఇంటిముందే ఆగాం, అందుకని చూశాను. "సంపూర్ణ విధ్వంసం" అనే మాట అపార్థాన్ని కలిగిస్తుంది. ఒక ఇల్లు పూర్తిగా విధ్వంసం కావడం ఎన్నడో తప్ప జరగదు; మూడు నాలుగుసార్లు బాంబుదెబ్బ తింటేనే అలా జరుగు తుంది; అటుతరవాత అది తగలబడిపోతే మరీమంచిది. మేముండిన ఇల్లు అధికార రీత్యా పూర్తిగా విధ్వంసమయింది, కాని యథార్థంగా కాలేదు. అంటే, నేనింకా దాన్ని గుర్తించగలిగాను; వాకిలీ, బెల్‌మీటలూ. తానున్న ఇంటిద్వారమూ, బెల్ మీటలూ ఎవరైనా గుర్తించగలిగితే ఆ ఇల్లు యథార్థంగా సాంతం నిర్మూలమయిం దనడం సరికాదనుకుంటాను.

"కొలోన్‌లో ఎక్కడ ఉండేవాడివి?" అని బెల్జియన్ సెంట్రీ అడిగాడు.

"అక్కడెక్కడో," అంటూ పడమటి శివార్లకేసి అస్పష్టంగా చూపాను.

"అమ్మయ్య, మళ్ళీ కదిలాం," అంటూ అతను తనముందు లారీలో పెట్టిన మరపిస్తోలు మళ్ళీ తీసుకుని, తన కుళాయి సరిచేసుకున్నాడు. కుళాయి ముందుభాగంలో ఉన్న ఫ్లాండర్స్ సింహం మురికిగా ఉన్నది. మేము ఖ్లోడ్విగ్ స్క్వేర్‌లోకి తిరిగాక లారీలు నిలిచిన కారణం తెలిసింది. అక్కడ ఏదో దాడి లాటిది జరిగినట్టుగా కనబడింది. అంతటా ఇంగ్లీషు మిలిటరీపోలీసు కార్లున్నాయి. వాటిమీద చేతులు పైకెత్తి పెట్టుకుని సివిలియను లున్నారు. చుట్టూ పెద్ద గుంపు చేరింది, వాళ్ళు ప్రశాంతంగానే ఉన్నారు గాని ఉద్రిక్తులై ఉన్నారు. నాశనమైన ఆ నగరంలో ఆ ప్రశాంత వాతావరణంలో అంతమంది ప్రజలుండడం ఆశ్చర్యం.

"బ్లాక్‌మార్కెట్. అప్పుడప్పుడూ పట్టుకుంటూ ఉంటారు," అన్నాడు బెల్జియన్ సెంట్రీ.

మేమింకా బాన్ వీధిలో ఉండగానే, కొలోన్ దాటకముందే, నాకు నిద్ర వచ్చేసి, మా అమ్మతాలూకు కాఫీమర కలలోకి వచ్చింది. హెర్ బోర్క్[14] రచించిన చిత్రాన్ని ఇవ్వజూపినవాడు కాఫీమరకు ఒక పట్కా కట్టి కిందికి దించుతున్నాడు; అయితే కిందఉన్నవాడు కాఫీమర తనకు అక్కర్లేదన్నాడు; రెండోవాడు ఆ మరను మళ్ళా పైకిలాగి, హాలు తలుపులు తెరిచి, మరను ఉన్నచోటనే, వంటింటి వాకిలికి ఎడమప్రక్కన శీలలతో బిగించడానికి చూశాడు. కాని అక్కడ గోడలేదు, అయినా ఆ మనిషి తన ప్రయత్నం మానలేదు. (కలలోనే నాకా మనిషి క్రమం మీదగల ఆసక్తి ఎంతో నచ్చింది.) అతను కుడిచేతి చూపుడువేలుతో శీలలకోసం తడిమాడు; అవి దొరకలేదు; ఆకాశంలో కాఫీమరను అమర్చడానికి లేదు, అందుచేత అతనా ఆకాశాన్ని చేతితో బెదిరించి, తన ప్రయత్నం మాని, కాఫీమరకు మళ్ళీ పట్కా తగిలించి, ముందుకువెళ్ళి, కాఫీమరను దించి, మూడోవాడికి ఇవ్వ జూపాడు; అతను మళ్ళీ దాన్ని నిరాకరించాడు. మొదటివాడు దాన్ని పైకి చేదుకుని, పట్కావిప్పి, కాఫీమరను భద్రంగా తన జాకెట్‌లో దాచుకుని, పట్కాను ఒక చుట్టగా చుట్టి, మూడోవాడి ముఖాన విసిరికొట్టాడు. అంతసేపూ నేను లోఖ్నర్[15] చిత్తరువు ఇవ్వజూపినవా డేమయాడా అని చూశాను, కాని వాడి జాడ లేదు. ఎందుకోగాని నేను మూలకేసి చూడలేదు, అక్కడ మా నాన్న దస్కు ఉన్నది. వాడు మా నాన్న నోటుబుక్కు చదివేసిపోతాడేమోనని నాకు బెంగ పట్టుకున్నది. కాఫీమర మనిషి ఇప్పుడు లివింగ్‌రూము వాకిలిదగ్గిర నిలబడి, కాఫీమరను తలుపుచెక్కకు బిగించాలని చూస్తున్నాడు. ఆ కాఫీమర కొకచోటు చూసి, దాన్ని స్థిరంగా ఏర్పాటు చెయ్యాలని దృఢనిశ్చయం చేసుకున్నట్టు కనబడ్డాడు, నా కతనంటే అభిమానం పుట్టుకొచ్చింది. అంతలోనే నేనతన్ని గుర్తించాను. అతను మాకుండిన అనేకమంది స్నేహితులలో ఒకడు. అతన్ని మా అమ్మ ఆ కాఫీమరకింద ఓదార్చింది. అతను యుద్ధారంభంలో విమానదాడిలో చనిపోయాడు.

మేము బాన్ చేరకముందే బెల్జియన్ సెంట్రీ నన్ను నిద్రలేపాడు. "ఊఁ, కళ్ళు తుడుచుకో, స్వేచ్ఛ రాబోతున్నది," అన్నాడు. నేను నిటారుగా కూర్చుని, మా అమ్మ కాఫీమర క్రింద కూర్చున్నవారి నందరిని జ్ఞాపకం చేసుకున్నాను— బడి ఎగగొట్టినవాళ్ళకు చదువుభయం పోగొట్టిందామె, నాజీలకు బోధచేసింది, నాజీలు కానివారికి ధైర్యం ఇచ్చింది: వాళ్ళందరూ కాఫీమర కింది కుర్చీల్లో

కూర్చున్నారు, ఊరటా, ఆరోపణా, సమర్థనా, శిక్షవిముక్తి పొందారు. కఠినమైన మాటలు వారి ఆదర్శాలను ఛిన్నాభిన్నంచేశాయి, మృదువైన మాటలు, కలకాలం జ్ఞాపకం ఉండేవి, వారికి లభించాయి; దుర్బలులపట్ల దయా, పీడితులకు ఓదార్పూ

పాతశ్మశానం, అంగళ్ళు, విశ్వవిద్యాలయం, బాన్. కోబ్లెన్స్‌గేటు దాటితే హోఫ్‌గార్టెన్. "వెళ్ళివొస్తా," అన్నాడు బెల్జియన్ సెంట్రీ. వేలుగాదు అలిసిపోయిన పసిపిల్లవాడి ముఖంవేసుకుని, "ఎప్పుడైనా ఉత్తరాలు రాస్తూఉండు," అన్నాడు. "అలాగే, నా దగ్గరఉన్న తుచోల్‌స్కీ సమగ్రసాహిత్యం పంపుతాను," అన్నాను.

"భేష్. క్లెస్ట్‌వి కూడానా ?" అన్నాడు.

"లేదు. రెండేసి కాపీ ఉన్నవి మాత్రమే :" అన్నాను.

ముళ్ళతీగె కంచెకుండా మాకు విమోచనం. ఆ కంచెముందు ఒకమనిషి రెండు పెద్ద చాకిరేవు తట్టలు పెట్టుకుని నిలుచున్నాడు. ఒక తట్టనిండా ఆపిల్ పళ్ళున్నాయి. రెండోదానిలో కొద్దిగా సబ్బుబిళ్ళ లున్నాయి. "వైటమినులు, కామ్రేడ్స్. ఒక సబ్బుబిళ్ళకు ఒక ఆపిల్," అని కేకపెడుతున్నాడు. నాకు నోరూరింది; ఆపిల్‌పళ్ళ ముఖమే పూర్తిగా మరిచాను; వాడి కొక సబ్బుబిళ్ళ యిచ్చి, ఆపిల్ తీసుకుని, వెంటనే కొరికాను. నేను కదలకుండా నిలబడి, మిగిలిన వాళ్లు కూడా బయటికి వస్తూండడం చూశాను. ఇక ఆ మనిషి కేకపెట్టే పని లేదు; వ్యాపారం నిశ్శబ్దంగా సాగింది; తట్టలోనుంచి ఆపిల్ తియ్యడమూ, దాన్ని ఇచ్చి సబ్బుబిళ్ళ తీసుకోవడమూ, ఖాళీతట్టలోకి గిరవాటు వెయ్యడమూనూ; సబ్బు బిళ్ళ తట్టలో పడేటప్పుడు తప్ మని చప్పుడయేది. అందరూ ఆపిల్‌పళ్లు తీసుకో లేదు, అందరిదగ్గిరా సబ్బుబిళ్ళలు లేవు, ఎవరి శక్తి చాలివస్తే వారు వ్యాపారం ముగించారు. నేను ఆపిల్ తినడం ముగించేసరికి, వాడి సబ్బుల తట్ట సగం నిండింది. మాటా పలుకూ లేకుండా వ్యవహారం సాఫీగా నడుస్తున్నది. డబ్బు విషయంలో చాలా పొదుపూ, జాగ్రత్తా కలవాళ్ళు సైతం ఆపిల్‌పళ్లు చూసి నిగ్ర హించుకోలేకుండా ఉన్నారు. వాళ్ళను చూస్తే నాకు జాలివేసింది. మాతృదేశం తిరిగివచ్చే సైనికులను ఎంతో ప్రేమగా వైటమినులతో పలకరించింది.

బాన్‌లో నాకు ఎంతకీ టెలిఫోన్ దొరకలేదు. చివరకు పోస్టాఫీసులో ఒక పిల్ల చెప్పింది, డాక్టర్లకూ, మతగురువులకూ మాత్రమే టెలిఫోను లిస్తున్నారని; అదైనా నాజీలు కాకపోతేనే. "ప్రచ్ఛన్న నాజీలంటే వాళ్ళకి తగని భయం. నీ

దగ్గిర సిగరెట్టుగాని ఉందా ?" అన్నదామె. నేను జేబులోనుంచి పొగాకు పాకెట్టు తీసి, "సిగరెట్టు చుట్టి ఇవ్వనా?" అన్నాను. వద్దనీ, తానే చుట్టుకోగలననీ అన్నది. నేను చూస్తుండగానే ఆమె తన కోటు జేబులోనుంచి సిగరెట్టు కాగితం తీసి, నేర్పుగా నిండైన సిగరెట్టు క్షణంలో చుట్టేసింది. "అయితే, ఎవరికి టెలిఫోను చెయ్యాలని ?" అని ఆమె అన్నది. "నా భార్యకు," అన్నాను. ఆమె నవ్వి, నాది పెండ్లి అయిన ముఖంగా కనబడలేదంది. నేనుకూడా ఒక సిగరెట్టు చుట్టుకుని, నబ్బుబిళ్ళలు కొనేవాళ్లెవరైనా ఉంటారా అని అడిగాను. నా దగ్గిర చిల్లిగవ్వ లేదు, ప్రయాణం ఖర్చుకు డబ్బు కావాలి. "సబ్బా ? ఏదీ చూడనీ," అన్నది. నా కోటు అస్తరులోపల వెతికి సబ్బుబిళ్ళ ఒకటి తీశాను. దాన్ని ఆమె నా చేతినుంచి లాగుకుని, వాసన చూసి, "అరె, నిజమైన పామోలివ్—నిజంగానే చాలా ఖరీదు. దీనికి యాభై మార్కులిస్తాను," అన్నది. నే నామెకేసి ఆశ్చర్యంగా చూశాను. "అవును, నాకు తెలుసు, దానికి ఎనభై మార్కులు కూడా ఇస్తున్నారు, కాని నే నివ్వలేను," అన్నదామె. నే నా యాభై మార్కులు తీసుకోదలచలేదు, కాని ఆమె బలవంతంచేసి, నోటు నా కోటుజేబులో కుక్కి, పోస్టాఫీసులో నుంచి పరిగెత్తిపోయింది. ఆమె అందంగా ఉన్నది, శ్రద్ధతో కూడిన అందం, అమ్మాయిలలో ఒక విధమైన చురుకుదనం కలిగించేది.

పోస్టాఫీసులోనూ, బాన్ వీధులవెంట నడుస్తూనూ నేను గమనించిన ముఖ్య విషయమేమంటే, వర్ణచిహ్నాలు[16] ధరించిన విద్యార్థి అన్నవా డెక్కడా కనబడలేదు, కంపుమాత్రం ఉన్నది, ప్రజలందరూ కంపుకొట్టారు, ఏ గది చూసినా కంపే, ఆ పిల్ల సబ్బుకోసం ఎందుకలా కొట్టుకుపోయిందో అర్థంచేసుకోగలిగాను. నేను స్టేషనుకు వెళ్ళి, ఓబెరెషెన్‌బాఖ్‌కు ఎలా వెళ్ళాలో వాకబు చేశాను (నేను వెళ్ళాడిన మనిషి అక్కడ ఉన్నది), కాని ఎవరూ చెప్పారుకారు. ఆ ప్రదేశం గురించి నాకు తెలిసిందల్లా ఏమిటంటే, అది బాన్‌కు చాలాదూరాన ఐఫెల్[17]లో ఉన్నదని. దాని జాడ తెలుసుకుందామంటే ఎక్కడా 'మాపు' అన్నది లేదు. ప్రచ్ఛన్న నాజీలకు వెరిచి మాపులను నిషేధించి ఉంటారు. ఈ ఓబెరెషెన్‌బాఖ్ అనేది స్పష్టంగా ఎక్కడ ఉండేదీ తెలుసుకోవాలని ఎప్పుడూ అనుకుంటూండేవాణ్ణి, కాని అది ఎక్కడ ఉన్నదీ నిక్కచ్చిగా తెలుసుకోలేక పోవడంచేత నాకు ఆందోళన కలిగింది. నాకు బాన్‌లో తెలిసిన ఎత్రసులన్నీ ముందుకూ, వెనక్కూ

తిప్పిచూశాను, కాని వాటిలో ఒక డాక్టరుదిగాని, మతగురువుదిగాని లేదు. చివరకు నా కొక థియోలజీ ప్రొఫెసరు జ్ఞాపకం వచ్చాడు, యుద్ధానికి కొంచెం ముందుగా నేనొక స్నేహితుడివెంట ఆయనను చూడబోయాను. ఆయనకు "హోమ్-ఇండెక్స్" శాఖనుంచి కొంత సంకటం కలిగింది, మేము మా సానుభూతి తెలపడానికి మాత్రమే ఆయన యింటికి వెళ్ళాం. ఆ వీధిపేరు మరిచాను గాని, అది ఎక్కడ ఉన్నదీ నాకు తెలుసు; నేను పాపెల్స్‌డార్ఫ్ అవెన్యూ వెంట వెళ్ళి, ఎడమపక్కకు తిరిగి, మళ్ళా ఎడమపక్కకు తిరిగి ఇల్లు కనుక్కున్నాను: వాకిలి మీద పేరు చూడగానే నాకు ఊరట కలిగింది. ప్రొఫెసరు స్వయంగావచ్చి తలుపు తెరిచాడు. "మీ రిప్పుడు నన్ను పోల్చుకోవడం సాధ్యంకాదు, ప్రొఫెసర్. 'హోమ్-ఇండెక్స్' తో మీరు తగాదా పడ్డప్పుడు నేను మీ యింటికొచ్చాను—ఒక్కక్షణం మీతో మాట్లాడాలి," అన్నాను. తగాదా అన్నమాటకు నవ్వి ఆయన, "నిరభ్యంతరంగా," అంటూ తన 'స్టడీ'లోకి దారితీశాడు. అది ఇప్పుడు పొగాకు వాసన కొట్టకపోవడం గమనించాను, అంతకుమించి మార్పేమీ లేదు—అవే పుస్తకాలు, ఫైలింగ్ కాబినెట్‌లు, రబ్బరుమొక్కలు. మతగురువులకూ, డాక్టర్లకూ మాత్రమే టెలిఫోను లున్నట్టు తెలిసిందనీ, ఎలాగోలాగ నేను నా భార్యకు టెలిఫోను చెయ్యవలసి ఉన్నదనీ ప్రొఫెసరుతో అన్నాను. ఆయన నన్ను పూర్తిగా చెప్పనిచ్చి, నిజానికి తాను మతగురువునేగాని, టెలిఫోనుండే మతగురువును కానని చెప్పాడు. "ఏమంటే, నేను ఆధ్యాత్మికసలహా లిచ్చేవాణ్ణి కాను," అన్నాడాయన.

"మీరు ప్రచ్ఛన్న నాజీ కాబోలు," అన్నాను; నే నాయనకు పొగాకు ఇవ్వజూపాను; ఆయన నా పొగాకుకేసి చూసిన చూపుకు నాకు జాలివేసింది; ముసలివాళ్ళు తమకు చాలా ఇష్టమైనవి లేకుండా జరుపుకోవలసివస్తే నాకు జాలి. ఆయన పొగాకుతో తన పైపు నింపుకునేటప్పు డాయన చేతులు వణికాయి, ఆ వణుకు కేవలమూ వార్ధక్యంవల్ల కాదు. నా దగ్గిర అగ్గిపుల్లలు లేవు ఆయన కిద్దామంటే. ఆయన చివరకు పైపు వెలిగించుకున్నాక నాతో, టెలిఫోనులు డాక్టర్లకూ, మతగురువులకూ మాత్రమే కాదనీ, సోల్జర్లున్నచోటనల్లా మ్యూజిక్‌హాళ్ళు తెరిచారనీ, వాటిల్లోకూడా ఉంటాయనీ, వాటిల్లో ఎక్కడైనా ప్రయత్నించమనీ అన్నాడు. వీధి మలుపులోనే ఒకటి ఉన్నది. నేను వెళ్ళిపోతూ ఆయన డస్కుమీద కొంత పొగాకు ఉంచినప్పు డాయన కన్నీరు కారుస్తూ, నేనేం చేస్తున్నదీ నాకు తెలుసునా

అని అడిగాడు. నాకు తెలుసునన్నాను. ఆనాడాయన హోమ్ విషయంలో చూపిన ధైర్యానికి ఈ కొద్ది పొగాకు కాలాతీతమైన కానుకగా స్వీకరించమని కోరాను. నా కోటు అస్తరులోపల ఇంకా అయిదారు సబ్బుబిళ్ళ ఉన్నాయి, వాటిలో ఒకటి ఆయన కివ్వాలనిపించింది గాని, అలా చేస్తే ఆయన గుండెలు అవిసిపోతాయని భయపడ్డాను; ఆయన అంత వార్ధక్యంతోనూ, బలహీనంగానూ ఉన్నాడు.

"మ్యూజిక్ హాల్" అన్నది మర్యాదవాచకం, కాని అది నన్నంతగా బాధించ లేదు, నన్ను అంతో ఇంతో బాధించినది ఈ మ్యూజిక్ హాల్ వాకిలి బయట ఉండిన ఇంగ్లీషు సెంట్రీ. ఇతనింకా కుర్రవాడే, నేను తనకు సమీపంగా వచ్చి నిలబడేసరికి, నా కేసి తీక్ష్ణంగా చూశాడు. ఆ మ్యూజిక్ హాలులోకి జర్మనులకు ప్రవేశం లేదని రాసి ఉన్నది నాకు చూపాడు. కాని, నా చెల్లెలు లోపల పనిచేస్తున్నదనీ, నేను ప్రియతమమైన మాతృదేశానికి ఇదే తిరిగి రావడమనీ, ఇంటి తాళపుచెవి నా చెల్లెలు దగ్గిర ఉన్నదనీ చెప్పాను. మీ చెల్లెలు పేరేమిటని అడిగాడు, సర్వసామాన్యమైన జర్మను ఆడపేరు చెప్పడం క్షేమ మనిపించి, "గ్రెచెన్" అన్నాను. "ఓహో, ఆ తెలికరంగుదా?" అని అతను నన్ను లోపలికి పోనిచ్చాడు. ఆ భవనం లోపలి దృశ్యాలను వర్ణించను, తత్సంబంధమైన "అమ్మాయిల" సాహిత్యంలోనూ, సినిమాలలోనూ, టెలివిజన్‌లోనూ అది దొరుకుతుంది. గ్రెచెన్‌నికూడా వర్ణించను (అదికూడా పైవాటిలోనే దొరుకుతుంది). ముఖ్యమైన విషయమేమంటే గ్రెచెన్ సూక్ష్మగ్రహణశక్తి గల పిల్ల, ఒక పామోలివ్ సబ్బుబిళ్ళ మూల్యానికి కిర్షెన్‌బాఖ్‌లోని వికరేజ్‌కి టెలిఫోను కనెక్షను ఇవ్వడానికి ఒప్పుకున్నది (ఆ చోటింకా ఉన్నదనే నా ఆశ), అక్కడినుంచి నేను పెళ్ళాడిన మనిషికి వార్త వెళుతుందన్నమాట. గ్రెచెన్ టెలిఫోనులో ఇంగ్లీషులో ధారాళంగా మాట్లాడి, తన స్నేహితురాలు సర్వీస్‌లైనుద్వారా "కాల్" ఏర్పాటు చెయ్య యత్నిస్తున్నదనీ, అలా అయితే జాప్యం ఉండదనీ నాతో అన్నది. మేము టెలిఫోన్‌కోసం వేచి ఉన్న సమయంలో ఆమెకు పొగాకు ఇవ్వబోయాను, అయితే ఆమెవద్ద అంతకన్న మేలైనదే ఉన్నది; ముందుగానే ఇస్తానన్న సబ్బుబిళ్ళ ఇవ్వబోయాను, ఆమె వద్దులెమ్మనీ, ఈ సహాయం చేసినందుకు తానేమీ తీసుకోననీ అన్నది. నేను తీసుకుతీరాలని పట్టుబట్టేసరికి ఆమె ఏడవనారంభించి,

తన అన్న ఒకడు ఖైదులో ఉన్నాడనీ, ఇంకో అన్న చనిపోయాడనీ అన్నది. గ్రెచెన్‌లాటి అమ్మాయిలు ఏడుస్తుంటే ఏమీ బాగుండదు, నాకు ఆమెమీద జాలి కలిగింది. తాను కేథలిక్కు అయిన మాటకూడా ఆమె నా దగ్గిర ఒప్పేసుకున్నది. ఆమె తన మొదటి కమ్యూనియన్ ఫోటో డ్రాయరులోనుంచి తీయబోతూండగా టెలిఫోను మోగింది. గ్రెచెన్ రిసీవరు తీసి, "పాస్టర్," అన్నది. కాని అంతకు ముందే నేను స్త్రీకంఠాన్ని పోల్చాను. "ఒక్క క్షణం," అంటూ గ్రెచెన్ రిసీవరును నాకు అందించింది. నేను ఎంత ఉద్రేకపడిపోయానంటే, రిసీవరును పట్టుకోలేక జారవిడిచాను. అదృష్టవశాన అది గ్రెచెన్ ఒడిలో పడింది. ఆమె దాన్ని ఎత్తి నా చెవి దగ్గిర పెట్టింది. "హలో, నువేనా ?" అన్నాను.

"అవును. నువెవరు ?" అన్నదామె.

"నేను బాన్‌లో ఉన్నాను. యుద్ధం ముగిసింది—నాకు," అన్నాను.

"ఓయి దేవుడా. నేను నమ్మలేను. నిజంకాదు."

"నిజమే, నిజమే. నే నప్పుడు రాసిన కార్డు అందిందా ?"

"లేదు. ఏం కార్డు ?" అన్నదామె.

"నేను పట్టుబడ్డానే—అప్పుడు మమ్మల్ని ఒక కార్డు రాయనిచ్చారు."

"లేదు. ఎనిమిది నెలలుగా నాకు నీ వార్తే తెలీదు."

"పందిముండాకొడుకులు, కిర్షెన్‌బాఖ్ ఎక్కడున్నదో కాస్త చెప్పు," అన్నాను.

"నేను—" ఆమె పట్టలేకుండా ఏడుస్తూ పైన ఏమీ అనలేకపోయింది. ఆమె ఎక్కిళ్లూ, గుటకలూ వినిపించాయి నాకు. చివరకామె, "నిన్ను బాన్ స్టేషనులో కలుస్తాను," అన్నది. తరవాత ఆమె గొంతు మరి వినిపించలేదు. ఎవరో ఇంగ్లీషులో ఏదో అన్నారు, నాకు అర్థం కాలేదు.

గ్రెచెన్ రిసీవరు తీసుకుని, కాస్సేపు ఆలకించి, తల అడ్డంగాతిప్పి, రిసీవరు పెట్టేసింది. నే నామె కేసి చూసి, ఆమెకు సబ్బు ఇస్తాననడం సాధ్యం కాదని గ్రహించాను. చివరకు, "థాంక్ యూ" అనడం కూడా సాధ్యం కాలేదు. అది అర్థహీన మనిపించింది. నేను ఏమీ చెయ్యలేక చేతులు పైకెత్తి, బయటికి వచ్చేశాను. నేను స్టేషనుకు తిరిగి వెళ్ళాను. పెళ్ళి ధ్వనించని స్త్రీ కంఠం నా చెవులలో మోగుతున్నది.

## వివరణ

1. బెర్టోల్ట్ బ్రెఖ్ట్ (1898–1956) మార్క్సిస్టు, నాజీ వ్యతిరేక నాటక కర్త.

   కుర్ట్ తుచోల్‌స్కీ (1890–1935) ఆస్ట్రియన్ యూదు రచయిత, నేషనల్ సోషలిజముకూ, హింసకూ వ్యతిరేకి. ఆత్మహత్య చేసుకున్నాడు.

   వాల్టర్ బెంజమిన్ (1892–1940) యూదు వ్యాసకర్త, ఆత్మహత్య చేసుకున్నాడు.

   కార్ల్ క్రాజ్ (1874–1936) ఆస్ట్రియన్ వ్యంగ్య రచయిత.

   మార్సెల్ ప్రూస్ట్ (1871–1922) ఫ్రెంచి యూదు నవలాకారుడు.

   వీరందరి రచనలూ తగులబెట్టబడి, నాజీ ఇండెక్స్‌లో చేర్చబడ్డాయి.

2. ఎర్నెస్ట్ యుంగర్ (1895– ) మొదటి ప్రపంచయుద్ధానుభవంతో అనేక పుస్తకాలు రాసి, 20 ల లోనూ, 30 ల లోనూ విస్తారంగా చదవబడ్డాడు. నాజీశకంలోకూడా ఈయన జర్మనీలోనే ఉంటూ రచనలు సాగించాడు.

3. ఈ పేర్లన్నీ ప్రష్యను మిలిటారిజమునూ, జర్మను జాతీయవాదాన్నీ మూర్తీభవిస్తాయి.

   హైన్‌రిఖ్ ఫాన్ క్లైస్ట్ ( 1771–1811 ) నాటకకర్త. ఈయన నాటకాలలో ప్రష్యను జాతీయత ప్రతిబింబించిందన్న నమ్మకంతో మిలిటరిస్టులూ తీవ్ర జాతీయవాదులూ వాటిని కొంత వక్రీకరించి ఉపయోగించుకున్నారు.

   ఫ్రాంక్‌ఫర్ట్/ఓడర్ (అనగా ఓడర్‌నదిపై గల ఫ్రాంక్‌ఫర్ట్ నగరం. మయిన్ నదిపైన మరొక ఫ్రాంక్‌ఫర్ట్ ఉన్నది) ఇది ప్రష్యాలో క్లైస్ట్ జన్మస్థలం.

   హాంబర్గ్‌రాజు : అదే పేరుగల క్లైస్ట్ నాటకంలో నాయకపాత్ర. వాస్తవానికి ఈ రాజు ఉత్తరువులను ధిక్కరించి మూర్ఖమైన దాడిచేసి, ఫ్రెడరిక్

ది గ్రేట్ చేత క్షమించబడ్డాడు. ఈ కథను, క్లెస్ట్, ధర్మానికీ, ప్రేమకూ మధ్య సంఘర్షణగా కల్పనచేసి, చివరలో మహారాజు కరుణించినట్టు చిత్రించాడు.

పాట్స్‌డామ్ : ప్రష్యను రాజుల నివాసస్థలం. బెర్లిన్ సమీపంలో ఉన్నది. ఫ్రెడరిక్ ది గ్రేట్ కాలంలో ప్రష్యన్ మిలిటారిజముకు కేంద్రం. తరచు ప్రష్యా కిదే అసలురాజధానిలాగా ఉంటూండేది.

బెర్లిన్ : ప్రష్యాకు నిజమైన రాజధాని, జర్మను జాతీయాశయాలకు కేంద్రకం.

4. క్లోవిస్ : 1614 లో బ్రాండెన్‌బర్గ్‌లో చేర్చబడింది. (దరిమిలా బ్రాండెన్‌బర్గ్ ప్రష్యా అయింది.)

5. వెజెల్ : పూర్వం రైన్ నదిపైన ముఖ్యమైన స్థావరం. రెండవ ప్రపంచ యుద్ధంలో 97 శాతం విధ్వంసమయింది. 1945 మార్చిలో మిత్రమండలి బలాలు ఇక్కడే దాటివచ్చాయి.

6. ఫెర్డినాండ్ ఫాన్ షిల్ (17761-809) తన సొంత బలాలతో నెపోలియన్ సేనలనూ, డచ్చిసేనలనూ అద్భుతంగా ప్రతిఘటించి, జర్మను ప్రతిఘటనా దక్షతకూ, జర్మను విక్రమానికీ పెట్టినది పేరయాడు.

7. ప్రష్యాలో హెచ్చు ప్రాంతం రైన్‌నదికి తూర్పున ఉండేది. ఈ రెండు నగరాలు మాత్రం దాని పడమటితీరాన ఉన్నాయి.

8. ఫీల్డ్‌మార్షల్ ఫాన్ బ్లోంబర్గ్ : 1930 దశకంలో హిట్లరుకింద ఇతను అత్యున్నత సైనికాధికారి అయి, జర్మను సేనలకు కమాండరిన్‌చీఫ్ అయాడు. ఈయన తన అరవయ్యో ఏట యౌవనవతి అయిన తన సెక్రటరీని పెళ్ళాడ నిశ్చయించి, అందుకుగాను గొయెరింగ్, హిట్లర్ల అనుమతీ, సహాయమూకూడా సంపాదించి, "హనీమూన్"కు కాప్రీ వెళ్లాడు. దురదృష్ట వశాన, కొద్దిరోజులలోనే ఆయన భార్యగురించి పూర్వం తెలియని విషయా లనేకం బయటపడ్డాయి. ఆమెకు పోలీసురికార్డున్నది, వెలయాలుగా రిజిస్ట రయింది, బూతుఫొటోలు తీయించుకున్నందుకు శిక్షపడింది. బెర్లిన్‌లో జరిగిన తన తల్లి ఉత్తరక్రియలకు బ్లోంబర్గ్ హనీమూన్ నుంచి వెళ్ళిన

సమయంలో హిట్లరు ఆయనను డిస్మిస్ చేశాడు. అటుతరువాత ఆయన అజ్ఞాత జీవితంలో పడిపోయాడు. యుద్ధం ప్రారంభమయినప్పుడు కూడా ఆయనకు పిలుపురాలేదు. యువక సైనికుడు సిగ్గుపడడానికి తగిన కారణమే ఉన్నది.

9. రెండవ విలియం (1859-1941) 1888 నుంచి 1918 లో పదచ్యుతుడైనదాకా జర్మను చక్రవర్తి కెయిజరు.

ప్రాంత్స్ ఫాన్ పాపెన్ (1879—) అసమర్థుడూ, నిలకడలేని రాజకీయ వేత్తా. 1932 లో అయిదు మాసాలపాటు చాన్సలరుగా కూడా పని చేశాడు. ఈయన ప్రారంభంలో హిట్లరును ప్రతిఘటించాడు, తరవాత సహించాడు, తిరిగి ప్రతిఘటించాడు, చివరకు హిట్లరుతో చేరి వియన్నాలోనూ, తరవాత అంకారాలోనూ రాయబారిగా పనిచేశాడు. 1946 న్యూరెంబర్గు విచారణ లప్పుడీయనను వదిలేశారు.

హిండెన్‌బర్గ్ (1847-1934) మొదటి ప్రపంచ యుద్ధంలో విఖ్యాతి గన్న ఫీల్డ్ మార్షల్. 1925 లో జర్మనీకి అధ్యక్షుడయాడు, చాలాకాలం హిట్లరును ప్రతిఘటించి, చివరకు ప్రాణం విసిగి, లొంగిపోయి, హిట్లరును ప్రభుత్వం ఏర్పాటు చేయనిచ్చాడు.

బ్లోంబర్గ్ (8 చూడండి).

కైటెల్ : ఫీల్డ్‌మార్షల్ అయి, సైనికాధికారులకు అగ్రగణ్యుడుగా పనిచేసి నప్పటికీ సామాన్యమైన బంటులాటివాడు. న్యూరెంబర్గు విచారణలలో ఉరిశిక్ష పొందాడు.

10. హైన్‌రిఖ్ హైన్ (1797-1856) : నాజీల కాలంలో రచయితలు పడిన పాట్లలాటివే అనుభవించాడు. ఆయన యూదుజాతివాడు, తనకు తానుగానే అనేక ఏళ్ళపాటు పారిస్‌లో ప్రవాసం చేశాడు. ఇక్కడ ప్రస్తావితమైనది ఆయన గేయసంపుటిలోని "కెవ్లార్ యాత్ర" అన్న గేయం. (కెవలాయర్‌ను ఆయన కెవ్లార్ అని ఉచ్చరించాడు.)

11. జాంటెన్ : " నిబలుంగెన్‌లీట్ " అనే మధ్యయుగపు జర్మను మహా కావ్యంలో సీగ్‌ఫ్రీడ్ జన్మస్థలంగా చెప్పబడింది.

12. క్విరినస్ : మతానికి బలి అయిన క్రైస్తవ సంతు; నాయిస్‌లోని 13 వ శతాబ్దినాటి క్విరినస్ చర్చి రెండవ ప్రపంచయుద్ధంలో దెబ్బతిన్నది.

తిబాన్ లీజియన్ : తిబాయిడ్ ప్రాంతానికి చెందిన క్రైస్తవశాఖ తాలూకు సమాజం; ఈ సమాజాన్ని మాక్సిమిలియాన్ చక్రవర్తి నిర్మూలించినట్లు ఒక గాథ ఉన్నది. (తిబాయిడ్ నైల్ నదీ లోయ ఎగువప్రాంతంలో ఉన్నది: మూడవ శతాబ్ది లగాయతు ఇక్కడ క్రైస్తవ తాపస్యు లుంటూ వచ్చారు.)

13. వియెన్నాలాటి ఇతర యూరపు నగరాలలాగే కొలోన్‌లో కూడా వలయాకారం గల రింగురోడ్లున్నాయి. నగరాలకు రక్షణలు ఏర్పాటయే కాలంలో ఇవి అవతరించాయి.

14. బెర్‌బోర్థ్ (జూనియరు) (1617-1681) డచ్చి చిత్రకారుడు.

15. స్టీఫెన్ లోఖ్నర్ : కొలోన్ చిత్రకారుడు (1410-1451 మధ్య) ఆయన చిత్రాలలో కెల్లా ప్రసిద్ధమైనది ట్రిప్టిచ్, లేక "డోంబిల్డ్" అనే కెథీడ్రల్ చిత్రం.

16. విద్యార్థులు బయటికి వచ్చేటప్పుడు తమ తమ సంఘాలకు (ద్వంద్వ యుద్ధాలు వగైరాలకు చెందిన వాటికి) సంబంధించిన వర్ణ చిహ్నాలను (కుళాయిలూ, కాశలూ) ధరించడం ఆనవాయితీగా ఉండేది. (ఇప్పుడూ కొంతవరకు ఉన్నది).

17. ఐఫెల్ : శిలామయ, అరణ్యప్రాంతం. ఇది ఉజ్జాయింపుగా ఆఖెన్, ట్రీర్, కోబ్లెన్స్‌ల మధ్య గల త్రికోణం మధ్య ఉన్నది.